క్లుప్తంగా

విఘ్నేశ్వరుడికి విశేష పూజలు

పొన్నూరు: పొన్నూరులో గణపతి నవరాత్రి మహోత్సవాలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వైభవంగా సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంతో పాటు పలు గ్రామాల్లో అలంకరించిన ప్రత్యేక పందిళ్లలో కొలువుదీరిన భారీ గణనాథులు విశేష పూజలు అందుకున్నారు. పట్టణంలోని రెండో వార్డులో శ్రీ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం, పచ్చల తాడిపర్రులోని మండపంలో గణనాథుని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో యలవర్తి శేషు కుమార్, యంపరాల గోపి, మల్లంపాటి వాసు, నవీన్ తేజ, మనోహర్ పాల్గొన్నారు.

వరద బాధితులకు దాతల సహకారం అభినందనీయం



పెదకాకాని: వరద బాధితులకు దాతల సహకారం అభినందనీయమని తహసీల్దార్ టి.కృష్ణకాంత్ అన్నారు. పెదకాకానిలోని బాజీబాబా దర్గా ఏరియాలో ఉన్న సుమారు 120 కుటుంబాల ఇళ్లలోకి నీరు చేరి పునరావాస కేంద్రాలలో తలదాసుకుంటున్నారు. బాధితుకుల నంబూరు రైస్ ట్రీ పార్క్ దాతల సహకారంతో మంగళవారం దుస్తుల పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో వడ్డెర కాలనీలో 200 కుటుంబాలకు దుస్తుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతలు నూకవరపు హరికృష్ణ, పూర్ణచంద్రరావు, వీరయ్యచౌదరి, సుదర్శనరావు, వాసు పాల్గొన్నారు.

ఆహారంలో మార్పులతో రక్తహీనతకు చెక్



ప్రత్తిపాడు: ఆహారంలో స్వల్ప మార్పులను పాటించడం ద్వారా రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.భారతి, పి.మాధవి అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా మంగళవారం గొట్టిపాడు, చినకోండ్రుపాడు, రావిపాటివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలున్న ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ భారతి మాట్లాడుతూ రక్తహీనత ఉన్నవారిలో నీరసం, అలసట, చిరాకు, ఏకాగ్రత లేకపోవడం, బలహీనంగా ఉండటం, శ్వాస సంబంధ సమస్యలు, మెదడులో రక్త నాళాలు వాచి తలనొప్పి రావడం.. వంటి అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. మాధవి మాట్లాడుతూ మహిళలో 11–12 గ్రాముల హిమోగ్లోబిన్ ఉంటే సాధారణ స్థితిగా, 7 గ్రాముల కంటే తక్కువగా ఉంటే ప్రమాదకర స్థితిగా భావించాలన్నారు. రక్తహీనతను నివారించేందుకు ఐరన్, ఫోలిక్ యాసిడ్, బీ12 మాత్రలను వేసుకోవాలని సూచించారు. అంతే కాకుండా సి విటమిన్ అధికంగా ఉండే జామ, నారింజ, బత్తాయి, ఉసిరి.. వంటి పండ్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ నిర్మల, హెచ్‌వీ విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.పద్మ, పి.రాజ్యలక్ష్మి, వి.ద్వారక, పి.అక్కమ్మ, ఏఎన్‌ఎం కళావతి పాల్గొన్నారు.

ఇంట్లో బంగారం చోరీ

గుంటూరు రూరల్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. పరసా రమణయ్య న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. భార్య విజయలక్ష్మి రీజనల్ నర్సింగ్ ఇనిస్టిట్యూట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం విధుల నిమిత్తం ఇరువురు బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా, ఇంటి తలుపులు వెనుక వైపు నుంచి తెరిచి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు వివరాలు సేకరించారు. దుండగులు ఇంట్లోని బీరువాలోని 50 సవర్ల బంగారం, ఇతర వస్తువులు కలపి సుమారు రూ. 50 లక్షల వరకు చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రీసెర్చ్ సెల్ ఆధ్వర్యంలో సదస్సు

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం బయో ఈ –3 అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన వికసిత్ భారత్ 2047లో భాగంగా బయో ఈ –3 (బయోటెక్నాలజీ ఫర్ ఎకానమీ, ఎన్విరాన్మెంట్, ఎంప్లాయిమెంట్) పాలసీలు, జీవ ఉత్పత్తి పెంపొదించుట, అమృత కాలం నెరవేర్చే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహించామని సదస్సు డైరెక్టర్, రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా సీడీఎఫ్‌డీ శాస్త్రవేత్తలు ఎం.సుబ్బారెడ్డి, డాక్టర్ యతీస్ ఆచార్, డాక్టర్ మధుసూదన్ రెడ్డి హాజరయ్యారన్నారు. బయో ఈ – 3 పాలసీలను విద్యార్థులకు పరిశోధకులకు అతితులు వివరించారు. భవిష్యత్తులో బయో ఈ – 3 వల్ల ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని వాటి ద్వారా ఆర్థిక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ చేసేందుకు యువత భాగస్వాములుగా నిలవాలని సూచించారు. సదస్సులో ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పాల్గొన్నారు.

చెత్త శుద్ధి లేక...



చందోలు ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్త



వ్యర్థాల నీటితో దుర్గంధభరితంగా మారిన రోడ్డు

కొరవడిన పర్యవేక్షణ

- రోడ్డు వెంబడి చెత్త నిల్వలు..
- వెదజల్లుతున్న దుర్గంధం
- పొన్నూరు.. చందోలు రోడ్డులో ప్రజల అవస్థలు

పొన్నూరు: పారిశుద్ధ్యం క్షీణిస్తోంది.. అసలే వరదల కాలం.. ఇప్పటికి ప్రభావం కనిపిస్తోంది. అయినా అధికారులలో మార్పు కనిపించడం లేదు. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. పొన్నూరు.. చందోలు ప్రధాన రహదారిపై టన్నులకొద్దీ చెత్త నిల్వలు పేరుకుపోవడంతో దుర్గంధ భరితంగా మారింది. అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే చందోలు, రేపల్లె ప్రధాన రహదారిపై దుర్వాసన భరించలేక పట్టణ ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిడుబ్రోలు పెట్రోల్ బంక్ నుంచి డంపింగ్ యార్డు దాటే వరకు కొన్ని నిమిషాల పాటు ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పట్టణంలో ఇంతటి పారిశుద్ధ్య సమస్య ప్రజలను వేధిస్తున్నా శానిటేషన్ విభాగం స్పందించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వర్షాకాలంలో పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో ఇంటింటి నుంచి సేకరించిన టన్నుల కొద్దీ చెత్త వ్యర్థాలను చందోలు రోడ్డు వెంబడి నిల్వచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. డంపింగ్ యార్డులో కొన్ని నెలలుగా చెత్త సంపద లేక టన్నుల కొద్దీ చెత్త నిండింది. స్థల ప్రభావం కారణంగా పట్టణంలో సేకరించే చెత్త రోడ్డు వెంబడి నిల్వ చేస్తున్నారు. దీంతో ప్రధాన రహదారి దుర్గంధ భరితంగా మారింది. డంపింగ్ యార్డుకు తరలించిన చెత్తను సద్వినియోగం చేసుకోవడానికి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో సేకరించిన చెత్త వృథా అవుతోంది. తడి పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసి సంపద సృష్టించేందుకు అవకాశం ఉంది. కాని అధికారులు ఆ దిశగా చర్యలు చేప ట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి చందోలు రోడ్డులో చెత్త నిల్వలు తొలగించి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టణంలో వివరాలు..

వార్డులు	:	31
నివాసాలు	:	15 వేలు
జనాభా	:	70 వేలు
పురపాలకలో రోజు సేకరించే చెత్త	:	35 మెట్రిక్ టన్నులు

దుర్వాసన వెదజల్లుతోంది



రోడ్డు వెంబడి చెత్త నిల్వ చేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధాన రహదారి కావడంతో వాహన చోదకులు ఈ దారిన ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముక్కు మూసుకొని నడవాల్సిన పరిస్థితి నెలకొంది. రోజుల తరబడి సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–నాగరాజు, పొన్నూరు



చెత్త వ్యర్థాలతో నిండిన డంపింగ్ యార్డు

కూటమి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం

- ఇంకా వరదలోనే బాధితులు
- సాయం అందించడంలో కొరవడిన ప్రణాళిక
- అడుగడుగునా నిర్లక్ష్యం
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



పొన్నూరు: విజయవాడలో వరద కారణంగా జరిగిన ప్రాణ, ఆస్తి నష్టం చంద్రబాబు కూటమి ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ కాలంలో వరదల కారణంగా ప్రాణ నష్టం జరగడం పాలన వైఫల్యమే అని విమర్శించారు. వరదలపై ప్రజలను అప్రమత్తం చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కనీసం ప్రజలను అప్రమత్తం చేస్తే ఇంతటి నష్టం జరిగేది కాదని చెప్పారు. వరదపై కలెక్టర్లు, ఇంజినీర్లు ముందస్తుగా హెచ్చరించినా చంద్రబాబు ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. విపత్తుపై ప్రజలను హెచ్చరించడం, విపత్తు వచ్చిన తరువాత ప్రజలకు సక్రమంగా సేవలందించడంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని వివరించారు. కరోనాను ఎదుర్కోవడానికి కనీసం మౌలిక సదుపాయాలు లేని పరిస్థితుల్లో ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, ఆక్సిజన్ ప్లాంట్లు, మందులు, ల్యాబ్‌లు తదితర సదుపాయాలను ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని చెప్పారు. అటువంటి జగనన్నను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. కరోనాను ఎదుర్కోవడంలో దేశానికే వైఎస్ జగన్ స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు.

విశేష సేవలు అందించే అవకాశాలు ఉన్నా నిర్లక్ష్య ధోరణి

వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్లు, ఎండీయూ వాహనాలతో ప్రజలకు విశేష సేవలు అందించే అవకాశాలు ఉన్న వాటిని వినియోగించుకోకపోవడం ప్రభుత్వ కక్షపూరిత వైఖరికి నిదర్శనం అన్నారు. కేవలం జగన్ ప్రవేశపెట్టిన వ్యవస్థల కారణంగానే వాటిని చంద్రబాబు ప్రభుత్వం ఉపయోగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని చెప్పారు. లక్షల సంఖ్యలో వరద బాధితులకు కన్నీరు మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితులకు పూర్తిస్థాయిలో సహాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తాగునీటి శుద్ధిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు



ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రమేష్ బాబు

పొన్నూరు: నిడుబ్రోలులోని రక్షిత తాగునీటి పథకం ద్వారా సరఫరా చేసే విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాల రమేష్ బాబు ఆదేశించారు. పట్టణంలోని పలు వార్డులో మంగళవారం పర్యటించారు. నిడుబ్రోలులోని రక్షిత తాగునీటి ప్లాంట్ సందర్శించి నీటి శుద్ధి పరీక్షలను పరిశీలించారు. ప్రజల నుంచి తాగునీటి విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటేషన్ విభాగంలో నిర్లక్ష్యాన్ని వీడాలని, పట్టణ పరిసరాలలో ఎప్పటికప్పుడు చెత్తను సేకరించాలని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమల శెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థిని దత్తత తీసుకోవటం అభినందనీయం



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు రూరల్: దళిత పేద మెడికల్ విద్యార్థినిని దత్తత తీసుకుని తన విద్యాభివృద్ధికి సాయం అందించడం అభినందనీయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు తెలిపారు. గోరంట్ల గ్రామంలోని మల్లికార్జునపురంకాలనీలోని మీ శ్రేయోభిలాష స్వచ్ఛంద సేవా సంస్థలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గోరంట్ల గ్రామానికి చెందిన బిరుదు హాదస్సాకి కాకినాడలోని రంగనాయకులు మెడికల్ కళాశాలలో సీటు రావటం జరిగిందని, కానీ విద్యార్థిని పేదరికంతో చదువుకోలేని పరిస్థితిలో ఉండటంతో ఆమె గురించి తెలుసుకున్న మీ శ్రేయోభిలాష స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నారా జోషి, అనుపమ దంపతులు విద్యార్థి విద్యాభివృద్ధికి కృషిచేయాలని ఆర్థిక సాయం చేయటం అభినందించదగిన విషయమన్నారు. అదేవిధంగా విద్యార్థి మెడిసిన్ పూర్తయ్యే వరకు వారే పూర్తి బాధ్యత వహిస్తామని హామీ ఇవ్వటం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా మొదటి విడతగా రూ.29 వేల చెక్కును విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బాలాజీ, సంస్థ సభ్యులు ఎస్ఎస్ మీరా, సి.కృష్ణారావు, సురేష్, మాధవరెడ్డి, వై అప్పాజీ, కోటేశ్వరరావు, వెంకటేశ్వరావు, వెంకటరావు, ధనుంజయరావు, శివరాస్వామి పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో విజ్ఞాన్ విద్యార్థుల సర్వే

చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విజయవాడలోని వరద ప్రాంతాల్లో నాలుగో రోజు వరద సహాయక సర్వేలో పాల్గొన్నారని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 300 మంది ఐదు గ్రూపులుగా విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ కార్యక్రమాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అనే విషయాలపై సర్వే నిర్వహించి ప్రభుత్వం అందించిన గూగుల్ లింక్‌లో అప్డేట్ చేస్తున్నారని పేర్కొన్నారు. మరి కొంతమంది విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి లారీల్లో వచ్చిన ఆహార పదార్థాలను ట్రాక్టర్స్ లోకి అన్ లోడింగ్ చేయించి సమీప ప్రాంతాల్లోని ప్రజలకు అందించడంలో సహాయపడ్డారని వివరించారు.

ఉరుకు పటేల చిత్ర బృందం సందడి



విద్యార్థులతో కలసి నృత్యం చేస్తున్న చిత్రబృందం

గుంటూరు రూరల్: యువతకు మంచి మార్గనిర్దేశం చూపే సందేశాత్మక చిత్రాలను సినీ పరిశ్రమ ప్రోత్సహించాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. మంగళవారం ఇటీవల విడుదలైన ఉరుకు పటేల చిత్రం విజయోత్సవ వేడుకల్లో భాగంగా చిత్ర బృందం చౌడవరంలోని కళాశాలలో సందడి చేసింది. యువతను దృష్టిలో ఉంచుకొని చిత్ర దర్శక, నిర్మాతలు కుటుంబ కథనాంశాలతో పాటుగా యువతకు స్ఫూర్తి నిచ్చే చిత్రాలను నిర్మించాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. నటీనటులు తేజుస్ కంచెర్ల, ఖుష్బూ చౌదరి మాట్లాడారు. చిత్ర బృందం కళాశాల విద్యార్థులతో కలిసి నృత్యం చేసి, సెల్ఫీలు దిగి ఉత్సాహంగా గడిపారు. చిత్ర బృంద సభ్యులను కళాశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏట డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ పి.కిషోర్ పాల్గొన్నారు.

నేత్రాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొండపాటూరు(కాకుమాను): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు నేత్రాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కంటి వైద్యులు డాక్టర్ రాములు సూచించారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రాములు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చిన్న వయస్సు నుంచే ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్, కంప్యూటర్ వంటి వాటికి అలవాటి పడి పదే పదే వాటిని చూడడం వలన అనేక మంది చిన్నారులకు కంటి సమస్యలు వస్తున్నాయని హెచ్చరించారు. దీని వలన అతి చిన్న వయస్సులోనే కంటి అద్దాలు పెట్టుకోవల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచే నేత్రాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎలాంటి కంటి సమస్యలు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో నలుగురు విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వారికి త్వరలోనే కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు కేఎఫ్ కెనడీ, విజయ్ భాస్కర్, హెచ్‌ఎం శీలం అంకారావు పాల్గొన్నారు.

చలపతి విద్యార్థులకు గ్లోబల్ సర్టిఫికేషన్

గుంటూరు రూరల్: కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ సైబర్ సెక్యూరిటీ, డేటా సూన్స్ విభాగం విద్యార్థులు సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకింగ్‌లో తమ కళాశాల విద్యార్థులు గ్లోబల్ సర్టిఫికేషన్ సాధించినట్లు చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. కళాశాలలో మంగళవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల సైబర్ సెక్యూరిటీ విభాగం ఈసీ కౌన్సిల్‌తో ఒప్పందం కుదుర్చుకుని అందులో భాగంగా కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన 15 మంది విద్యార్థులు సర్టిఫికేషన్‌లో ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉత్తీర్ణత పొందిన గ్లోబల్ సర్టిఫికేషన్ పొందిన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, జె.భార్గవ్ అభినందించారు.

ఓ ప్రైవేట్ కళాశాల క్యాంపస్‌లో గందరగోళం

గుంటూరు రూరల్: ఓ ప్రైవేట్ కళాశాల క్యాంపస్‌లో మంగళవారం గందరగోళం నెలకొంది. హాస్టల్‌లో విద్యార్థులు రాత్రి భోజనాలు చేస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భయాందోళనకు గురయ్యారు. హాస్టల్ విద్యార్థులను ఇళ్ల పంపించివేచినట్లు సమాచారం. ఘటనపై నల్లపాడు పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదని సీఐ వంశీధర్ తెలిపారు.

ఎన్‌సీసీతో విద్యార్థులలో క్రమశిక్షణ

కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సిద్ధూ



విద్యార్థులను ఎంపిక చేస్తున్న కల్నల్ సి.ఎస్.సిద్ధూ

ప్రత్తిపాడు: ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ అలవాడుతుందని 25 ఏ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సి.ఎస్.సిద్ధూ అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(కిట్స్) కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఎన్‌సీసీలో చేరేందుకు ఎంపికలు నిర్వహించారు. రెండు వందల మంది విద్యార్థులకు పరీక్షలు జరిపి వారిలో 25 మంది విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కల్నల్ సిద్ధూ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ఎన్‌సీసీ విభాగం దేశ భద్రత, రక్షణలో కీలక భూమిక పోషిస్తుందన్నారు. సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, 25ఏ బెటాలియన్ ఎన్‌సీసీ ఆర్మీ సిబ్బంది ఆర్.దేవరాజ్, చిరంజీవి, కళాశాల ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ అబ్దుల్లా బేగ్, ఎన్‌సీసీ ఆఫీసర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

పీహెచ్‌ఎన్ డి.నిర్మలాదేవి



ప్రాథమిక పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న పిహెచ్‌ఎన్ నిర్మలాదేవి

ప్రత్తిపాడు: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్‌ఎన్ డి.నిర్మలాదేవి అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెదగొట్టిపాడు ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గాలి కాలుష్యం వలన తక్కువ సమయంలో జరిగే అనర్థాలు, దీర్ఘకాలికంగా ఎదురయ్యే సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పీహెచ్‌ఎన్ నిర్మలాదేవి మాట్లాడుతూ గాలి కాలుష్యం వలన స్వల్పకాలికంగా తలనొప్పితో పాటు దగ్గు, శ్వాసకోశ, నేత్ర సంబంధ సమస్యలు వస్తాయన్నారు. దీర్ఘకాలికంగా కేంద్ర నాడీ వ్యవస్థ, గుండెపోటు, ఆస్తమా, బ్రోన్కైటిస్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలకు వెళ్లకుండా ఉండటం, పటాసులు కాల్చడం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడం, పొల్యూషన్ ఉన్నప్పుడు వాకింగ్‌కు వెళ్లడం, కిటికీలు, తలుపులు తెరిచి ఉంచడం వంటివి చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ విజయలక్ష్మి, ఏఎన్‌ఎం కళావతి పాల్గొన్నారు.

ఏఐ టెక్నాలజీతో అద్భుతాలు

ప్రొఫెసర్ డాక్టర్ నాగాంజనేయులు



ప్రత్తిపాడు: ఏఐ టెక్నాలజీతో భవిష్యత్‌లో అద్భుతాలు క్రియేట్ చేయవచ్చని మిజోరాం విశ్వవిద్యాలయం ఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.వి.నాగాంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని తుమ్మలపాలెం శ్రీ మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మంగళవారం ఏఐ వినియోగం, జాతీయ విద్యావిధానంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మిజోరాం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.వి. నాగాంజనేయులు కృత్రిమ మేధ పని చేసే తీరు, ఉపయోగాలు, ఏఏ రంగాల్లో ఏఐని ఎలా వినియోగంచవచ్చు.. వంటి అనేక అంశాలను వివరించారు. జాతీయ విద్యావిధానం 2020లోని ప్రధానమైన అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ విధానం వలన రానున్న రోజుల్లో విద్యారంగంలో చోటుచేసుకునే మార్పులు, ఇంజినీరింగ్ విద్యలో అమల్లోనికి వచ్చిన మార్గదర్శకాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకే కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎంబీవీ సత్యనారాయణ, ఏఓ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో ఆత్మహత్యల నిరోధంపై సదస్సు

గుంటూరు రూరల్: డిప్రెషన్, మానసిక ఒత్తిడి వల్ల ఎంతోమంది వారి ఆలోచనలను భావాలను సరైన క్రమంలో ఆచరణ చేయలేక నిరుత్సాహం, నిరాశ, నిస్సహాయతలకు గురవుతుంటారని మానస హాస్పిటల్ మానసిక వైద్యనిపుణులు డాక్టర్ శ్రీరమ్య తెలిపారు. నగర శివారుల్లోని లాంఫాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఆత్మహత్య నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిరాశ, నిస్పృహ అనేవి వారి జీవితాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయన్నారు. ఈ లక్షణాలు తీవ్రస్థాయికి చేరినప్పుడు వారు జీవితంపై నియంత్రణ కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతుంటారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మానసిక వైద్యులు, కౌన్సెలర్లు, మానసిక ఆరోగ్య నిపుణులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. ఇందులో భాగంగానే డీప్ ట్రాన్స్‌క్రానియల్ మ్యాగ్నటిక్ స్టిములేషన్ అనే విధానం మానసిక ఒత్తిడి చికిత్సలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్షణికావేశంలో జీవితాలను త్యాగం చేయవద్దని ఎంతటి కష్టాన్నయినా ఇష్టంతో పోరాడి గెలవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు అతిథులను ఘనంగా సన్మానించారు.